క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



ధర్పల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని విత్తనాలు, ఎరువుల డీలర్లకు మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం ఆయన యాసంగి పంట విత్తనాల సరఫరాపై వారితో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి, రసీదులను తీసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను రైతులు పంట కాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పశువులకు టీకాలు



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో శనివారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు. గ్రామంలోని 20 ఆవులు, 146 గేదెలకు టీకాలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అర్గుల్ పశువైద్యాధికారిణి శశిరేఖ, గోపాల మిత్రలు రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాడి రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



సుభాష్‌నగర్: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ సూచించారు. నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు (శ్రద్ధానంద్ గంజ్)లో శనివారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా అపర్ణ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర, రూ.500 బోనస్ పొందాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి రకానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 చెల్లిస్తుందని, దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ రూ.500 (సన్నరకం) ఇస్తామని ప్రకటించిందని తెలిపారు. కావున రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం ఉండేలా చూసుకుని కేంద్రానికి తీసుకురావాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ సూపరింటెండెంట్, సిబ్బంది లాబన్, మధు, కిషన్, జీవన్ రెడ్డి, మెప్మా సిబ్బంది, హమాలీ, దడువాయిలు, చాటా కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. మండలంలోని కంజర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా డెంగీ పాజిటివ్ కేసు వచ్చిన ఇంటి వద్ద పరిసరాలను పరిశీలించారు. పాజిటివ్ కేసు వివరాలు తెలుసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి బయట, లోపల దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు ఆరోగ్య విద్య బోధించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్, రాజేందర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి కేజీబీవీ, మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణతో పాటు పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. దీంతోపాటు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. గజానంద్, పూర్ణమౌళి పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కాలనీని వీడని సమస్యలు

- అధ్వానంగా రోడ్లు, డ్రెయినేజీలు
- పరిసరాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



చంద్రశేఖర్‌కాలనీలోని రోడ్డుపై గుంతలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని చంద్రశేఖర్ కాలనీని సమస్యలు వీడటం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా.. కాలనీ సమస్యలు మాత్రం తీరడం లేదు. కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

చంద్రశేఖర్ కాలనీలో ఎక్కడి పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. రోడ్లు పూర్తిగా ధ్వంసమై, అక్కడక్కడ భయకరంగా గుంతలు ఏర్పడ్డాయి. కాలనీకి మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన చెత్త బండి రాకపోవడంతో పరిసరాల్లో చెత్త పేరుకుపోతుంది. దీంతో దోమలు విజృంభించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సైతం కాలనీవైపు రాకపోవడంతో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా మారాయి. పూడిక తొలగించకపోవడంతో డ్రెయినేజీలు వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీలు లీకేజీ కావడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

> **సమస్యలను పరిష్కరించాలి..**
>
> కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి. గత నెల రోజులుగా కాలనీలో చెత్తాచెదారం అలాగే ఉండిపోతుంది. పారిశుధ్య లోపంతో ప్రజలు ప్రాణాంతకమైన రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకోని సమస్యను పరిష్కరించాలి. అదే విధంగా రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి.
>
> –ప్రభాకర్, చంద్రశేఖర్ కాలనీ



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం



రోడ్డుపై పారుతున్న మురికినీరు

రైతులు ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు





ఖిల్లా డిచ్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. చంద్రాయన్‌పల్లిలో..

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అసత్యాలు మాట్లాడుతూ ప్రజలు, రైతులను రెచ్చగొడుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. ప్రజలు, రైతులు ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని ఆయన తెలిపారు. మండలంలోని బీబీపూర్‌లో రాంపూర్ సొసైటీ ఆధ్వర్యంలో, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ప్రతిపక్షాలకు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. సన్న రకానికి రూ.500 బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీవో శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, గంగారెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, కుమ్మరి చిన్న గంగారాం, కొరట్‌పల్లి ఆనంద్, న్యాస రాజేశ్వర్, కూరపాటి గంగాధర్, పాలసాని శ్రీనివాస్, తహసీల్దార్ ప్రభాకర్, ఏవో సుధామాధురి, ఆర్‌ఐ సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గన్నారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్‌లు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, నవీన్‌గౌడ్, ఇమ్మడి గోపి తదితరులు పాల్గొన్నారు.

గోసంగిల సమస్యలను పరిష్కరించాలి



నగరంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గోసంగిల సమస్యల పరిష్కరించాలని ఎస్సీ 57 ఉప కులాల రాష్ట్ర అధ్యక్షుడు నిరగొండ బుచ్చన్న డిమాండ్ చేశారు. ఈమేరకు ఈ నెల 21న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిర్వహించే నిరసన దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నగరంలో శనివారం నిరసన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిరసన దీక్ష కార్యక్రమానికి ఎస్సీ ఉపకులాలు గోసంగి, మొచి, బుడగజంగం, హోలియదాసరి, డక్కలి, చిందులు తదితర కులాలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం రేవంత్ రెడ్డి ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, త్వరగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో వెనుకబడ్డ ఉపకులాలను మాల, మాదిగ కులాలతో కలపకుండా ఎస్సీ–ఏ గ్రూపులో చేర్చి 7% రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాజేష్, నాయకులు కర్రె లింగస్వామి, గంధం గంగాధర్, పస్తం రాజన్న, రాజు, దళిత నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు చేస్తే సహించం

- రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



స్వామివారి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ సిటీ: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమైన ఘటన అని, హిందూ ఆలయాలపై దాడులు చేస్తే సహించమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న హిందువులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడాన్ని తప్పుపట్టారు. ఎంఐఎం చేతిలో సీఎం కీలుబొమ్మలా మారారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయన్నారు. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలనను గుర్తుకు తెచ్చేవిధంగా రేవంత్ పాలన కొనసాగుతుందని మండిపడ్డారు. హిందూ దేవతల విగ్రహాలను అవమానించడం, దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

నిజామాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. గంగాస్థాన్ ఫేజ్–2లోని ఉత్తర తిరుమలలో శనివారం ఆయన ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. మానవుడు కష్టపడితే దేవుడు ఇష్టపడతాడని.. చేసే పనిలో కూడా దైవత్వం చూడాలని వివరించారు. నిస్వార్థ బుద్ధి, కల్మషం లేని హృదయం మనిషిని ఎల్లప్పుడు మంచి మార్గంలో నడుపుతాయన్నారు. అనంతరం స్వామీజీని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కలసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బీజేపీ నేతలు ఉన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి



బోధన్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆర్మూర్/బోధన్/బాల్కొండ: హైదరాబాద్‌లో ఈనెల 20న నిర్వహించనున్న 'టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ'ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్ పట్టణాల్లో సంఘ నాయకులు సమావేశాలు నిర్వహించి, మాట్లాడారు. కార్మికుల పోరాటాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా దేశంలోని 14 రాష్ట్రాలలో కార్మిక పక్షాన పోరాటాలు చేస్తున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూను విలీనం చేస్తున్నామన్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు అందరూ వచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ముత్తన్న, మల్లేష్, నజీర్, మనోజ్, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వర్, సత్తెక్క, మక్కయ్య, జ్ఞానేశ్వర్, శంకర్, పోశెట్టి, సురేష్, గంగారాం, రాజు, సత్యనారాయణ, గంగాధర్, రాజేంధర్, సాయిలు తదితరులు ఉన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



బోధన్/ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలోని హిందూ ఆలయాలపై, దేవత విగ్రహాలపై దాడికి పాల్పడిన నిందితును కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం బోధన్‌లోని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఆర్మూర్‌లో ఆర్డీవో రాజాగౌడ్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ఆలయాలపై చోటు చేసుకుంటున్న దాడులను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ప్రవీణ్ కుమార్, సురేష్ ఇనాని, కోటేశ్వర్‌రావు, ఉదయ్, కృష్ణ, శివచరణ్, శ్రావణ్, శివకృష్ణ, దయానంద్, నిఖిల్, అజయ్, ప్రేమ్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.



సంక్షిప్తం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌కు చెందిన తలారి గంగాధర్ గతంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి, ఫోన్‌ను రికవరీ చేసి, శనివారం బాధితుడికి అందజేశారు. ఎస్సై ఎల్ రామ్, కానిస్టేబుల్ రాకేష్ ఉన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ఇందల్వాయి: ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో ఇందల్వాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెడ్ మాస్టర్ లక్ష్మీనాథం తెలిపారు. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి, కుసుమ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బొండ్ల శ్రీనివాస్ ఇటీవల బహెరన్‌లో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, రూ. ఐదు లక్షల పరిహారం అందించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, కేపీ రెడ్డి, కుంట మోహన్ రెడ్డి, ముచ్చె గోపాల్, బీజేపీ నాయకులు ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నిరసనలు

నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వనందుకు నేడు (ఆదివారం) జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కాంగ్రెస్ పాలనను ఎండగడుతూ ఈ నిరసనలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలి



మోపాల్: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని హెచ్‌ఎం నాగమణి తెలిపారు. మండలంలోని సిర్పూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆమె విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. సోమవారం నుంచి విద్యార్థులకు సమ్మేటీవ్–1 పరీక్షలు ఉన్నాయని, పరీక్షలకు సన్నద్ధమయ్యేలా పిల్లలను ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. అపార్ ఆవశ్యకత గురించి వారికి వివరించారు. ఉపాధ్యాయులు రాము, అనురాధ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పోరాటాల గొంతుక పీడీఎస్‌యూ



బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల పక్షాన పోరాటాల గొంతు కగా పీడీఎస్‌యూ నిలిచిందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు, సీనియర్ న్యాయ వాది సంగం అన్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో శనివారం పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల్లో ఎంతో మంది నాయకులు ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడారని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అంతకుముందు వేడుకల లోగోను ఆ విష్కరించారు. పీడీఎస్‌యూ అమరవీరులకు నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాస్, గౌతం కుమార్, కార్తీక్, సాయినాథ్, సుధాకర్, అరుణ్, పోశెట్టి, భీంరావ్ ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగు వ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో వరద గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదలను నిలిపివేశారు. జలాశయంలోకి 14,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కుల నీరుపోతోంది. వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు అందజేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చొరవతో లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,700	వెండి (కిలో)	96,500
22 క్యారెట్స్	73,537	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	36	50	గాజరుగడ్డ	50	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	60	90
జీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
జిర్నినుకాయ	80	120	గోబిగడ్డ	30	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	60	90
వంకాయ	40	60	బీట్‌రూట్	35	60
పాలకూర	50	80	కరివేపాకు	40	70
మెంతికూర	60	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
స్క్రీన్-2	కల్లుకంపౌండ్(తెలుగు)-10.40, జనక అయితే గనక -1.30, లవ్‌రెడ్డి -4.30, జిగ్రా(హిందీ)- 10.30
స్క్రీన్-3	వేట్టయన్ - 10.30 4.35 7.40, 10.40, ఖడ్గం(తెలుగు)-1.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వేట్టయన్(తెలుగు)- 10.10 ది వైల్డ్ రోబోట్ - 1.40, 7.45, 10.15, దేవర పార్ట్-1(తెలుగు)- 4.10
స్క్రీన్-2	ది వైల్డ్ రోబోట్(తెలుగు)-10.30, విశ్వం (తెలుగు) - 1.00 7.15, జనక అయితే గనక -4.15 10.30
స్క్రీన్-3	ఇద్దరు (తెలుగు)-10.00, లవ్‌రెడ్డి (తెలుగు) - 1.00 ,7.30, వేట్టయన్ (తెలుగు) - 4.00, ఖడ్గం (తెలుగు) - 10.30
స్క్రీన్-4	రివైన్డ్(తెలుగు)-10.25, వీక్షణం(తెలుగు) - 1.20, జిగ్రా(హిందీ) -4.00, వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	జనక అయితే గనక (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వేట్టయన్(తెలుగు)